సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



14,700 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు.



సువర్ణావకాశం ఓపెన్

అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సువర్ణావకాశం కల్పిస్తోంది.

- IIలో ▸

రేపు ఎస్సీ, ఎస్టీ స్పందన



కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుంది. అలాగే, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ కలెక్టరేట్ స్పందన హాలులో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తారన్నారు.

న్యూస్‌రీల్

20న ఉద్యోగుల స్పందన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఆ రోజు సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. కాగా.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం పలు గ్రామ, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మండలం	గ్రామం
అనపర్తి	అనపర్తి-5
బిక్కవోలు	కొంకుదురు-2
చాగల్లు	చాగల్లు-5
దేవరపల్లి	యాదవోలు-2
గోకవరం	కామరాజుపేట -2
కడియం	కడియపులంక-2
కోరుకొండ	కాపవరం
కొవ్వూరు	కుమారదేవరం-1
నిడదవోలు	తాడిమళ్ళ 2
,పెరవలి	కాకరపర్రు
రాజమహేంద్రవరం	కంబాలపేట
రాజమహేంద్రవరం రూరల్	వెంకటనగరం
రాజానగరం	శ్రీకృష్ణపట్నం
రంగంపేట	సింగంపల్లి
సీతానగరం	ఇనుగంటివారి పే
తాళ్లపూడి	గజ్జరం
ఉండ్రాజవరం -	కల్దారి-1

రాజకీయ పార్టీలది చురుకైన పాత్ర



సమావేశంలో పాల్గొన్న డీఆర్వో నరసింహులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీలు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జి.నరసింహులు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారం రోజుల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో వచ్చిన ఫారం 6, 7, 8 పురోగతిపై వివరాలు అందజేశారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించాలని నియోజకవర్గ ఈఆర్వోలను ఆదేశించారు. జిల్లాలో మూడు రోజులుగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల తనిఖీలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్.రమేష్ (కాంగ్రెస్), కె.రాజశేఖర్ (వైఎస్సార్ సీపీ), ఎస్ఎస్ మూర్తి (సీపీఐ) పాల్గొన్నారు.

11,109 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 14వ రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా 21 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. శిబిరాల్లో 11,109 మంది రోగులు వైద్యసేవలు పొందగా, 275 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు.

పకడ్బందీగా ఈవీఎంల తనిఖీ



తనిఖీ కేంద్రం వద్ద కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ: జిల్లాకు కేటాయించిన ఎన్నికల యూనిట్ల తనిఖీ బెంగళూర్ బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్ల ఆధ్వర్యంలో అత్యంత పకడ్బందీగా జరుగుతోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌లో (వేర్ హౌస్) జరుగుతున్న ఈ ప్రక్రియను బుధవారం అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీప్యాట్ యూనిట్ల తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ఆమె వెంట ఆర్డీవో, ఎఫ్ఎల్‌సీ ఇన్‌చార్జి ఏ.చైత్రవర్షిణి పాల్గొన్నారు.

కులవృత్తులకు కొండంత భరోసా



- జగనన్న చేదోడు కింద ఆర్థిక ప్రయోజనం
- నేడు నాలుగో విడత సాయం విడుదల
- జిల్లాలో 13,473 మందికి రూ.13.47 కోట్ల లబ్ధి
- ఏటా రూ.10వేల వంతున ఖాతాల్లో జమ

రాజమహేంద్రవరం రూరల్: కులవృత్తిపైనే ఆధారపడిన వారు కొందరు.. చేతి పనితో సంతృప్తి పడుతున్నవారు మరికొందరు. వీరందరినీ ఆదుకునేందుకు గతంలో ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదు. వారిని ఆర్థికంగా ఆదుకుని కొంత మేరైనా చేదోడు నందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్ష నాయకుని హోదాలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో వారి కష్టాలు స్వయంగా చూశారు.

నేరుగా వారి సమస్యలు తెలుసుకున్నారు. నేనున్నానని వారికి భరోసా కల్పించారు. అన్నమాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేశారు.

ఆ మూడు వృత్తుల వారికి ఆర్థిక సాయం

కులవృత్తులే జీవనాధారంగా బతుకు బండిని నడిపిస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులతో పాటు టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి సీఎం బాటలు వేశారు. ఈ మూడు రంగాలపై ఆధారపడిన ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా చేతివృత్తుల వారికి ఆసరాగా నిలిచే జగనన్న చేదోడు పథకం నగదు గురువారం అందజేయనున్నారు. 2020 జూన్ 10న తొలి విడతగా జగనన్న చేదోడు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. షాపులు ఉన్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్ల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని జమ చేశారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న వృత్తిదారులు ఈ పథకానికి అర్హులు. ఇప్పటి వరకూ మూడు పర్యాయాలో ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేసింది. ఈ ఏడాది మరోసారి లబ్ధిదారులకు గురువారం జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.10వేలు జమ చేయనున్నారు.

నేడు నాలుగో విడత అమలు

2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత జగనన్న చేదోడు పథకాన్ని గురువారం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు చేయనున్నారు. జిల్లాలో 13,473 మందికి రూ.13.47 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ కానున్నాయి. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తారు.



మూడో విడత జగనన్న చేదోడు పథకం నమూనా చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

జిల్లాలో లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
గోపాలపురం	2,942	2.94
నిడదవోలు	2,205	2.21
అనపర్తి	2,189	2.19
రాజానగరం	1,879	1.88
రాజమహేంద్రవరం రూరల్	1,699	1.70
కొవ్వూరు	1,668	1.67
రాజమహేంద్రవరం సిటీ	1,261	1.26
మొత్తం	13,843	13.84

మూడు విడతల్లో ఇప్పటి వరకు చేకూరిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారులు	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
2020-21	12,181	రూ.12.18
2021-22	9,944	రూ. 9.94
2022-23	13,491	రూ.13.49

పారదర్శకంగా ఎంపిక



జగనన్న చేదోడు పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాం. వృత్తిదారులు ఈ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని, ఆర్థికంగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. నాలుగో విడత సాయం గురువారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

– కేఎస్‌వీ ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇన్‌చార్జి), బీసీ కార్పొరేషన్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కిర్లంపూడి: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి కె.పట్టాభిరామ్ బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎంపికైన 18 మంది ఖోఖో క్రీడాకారులకు స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 22 వరకూ చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అత్తిలి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వి.రాంబాబు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను వైఎంఎస్‌సీ అధ్యక్షులు పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

కొబ్బరి ఉత్పత్తులను పరిశీలించిన కేంద్ర బృందం



కొబ్బరిపీచుతో తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మామిడికుదురు: కొబ్బరి ఉత్పత్తులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. ఏపీ, తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్స్ క్లస్టర్ ఇన్‌చార్జి సుధీర్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం పాశర్లపూడి, మామిడికుదురు, ఈదరాడ గ్రామాల్లో బుధవారం పర్యటించింది. పాశర్లపూడిలో కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. రెండు గ్రామాల్లోనూ కొబ్బరి పీచుతో మహిళలు తయారు చేస్తున్న బొమ్మలు, గోదినీలను నిశితంగా పరిశీలించారు. కోనసీమలోని బండారులంక టెక్స్‌టైల్ పరిశ్రమ, పాశర్లపూడిలో కొబ్బరి పీచుతో తయారు చేసే బొమ్మల పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరుతూ కేంద్ర జౌళి శాఖ మంత్రి దర్శనా జర్దోష్‌కు ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం ఇటీవల వినతిపత్రం అందించారు. బండారులంక చీరలు, క్వాయర్ ఫైబర్ బొమ్మలు రెండు విభిన్న మినీ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని కోరారు.

ఆరోగ్యాంధ్రకు ప్రభుత్వం చర్యలు


హోంమంత్రి తానేటి వనిత

చాగల్లు: ప్రభుత్వంవైద్య రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. బుధవారం చాగల్లు సచివాలయం-4 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. క్యాంపులో అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. సేవలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సచివాలయంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడంతో పాటు అవసరమైతే పెద్ద పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఇలా ప్రభుత్వ వైద్యులు ఇంటి వద్దకు వచ్చి పేద ప్రజల ఆరోగ్యక్షేమాలు తెలుసుకుని సేవలు అందించిన ప్రభుత్వం ఏదైనా ఉందా..? అని వనిత ప్రశ్నించారు. దేశంలోనే మొదటిసారిగా స్పెషలిస్టులను ఇంటివద్దకు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికీ వలంటీరు వెళ్లి వారి ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరిస్తున్నారన్నారు. తర్వాత ఎప్పుడు శిబిరం నిర్వహిస్తున్నారో తెలియజేసి టోకెన్ కూడా ఇస్తున్నారని చెప్పారు. వీరికి శిబిరంలో వైద్యం అందించడంతో పాటు ఖరీదైన మందులు కూడా ఇస్తున్నామన్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరంలో ప్రత్యేక వైద్యుల బందం 526 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టావీరాస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు జుట్టా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన హోంమంత్రి తానేటి వనిత

కోటసత్తెమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం



కోటసత్తెమ్మ ఆలయంలో కేరళ డప్పు వాయిద్యాలతో అలరిస్తున్న కళాకారులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం భక్తుల కోలాహలంతో బుధవారం సందడిగా మారింది. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పుష్పాలంకరణతో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. నాలుగోరోజు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 226 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీపారాయణం, హోమాలు నిర్వహించారు. కేరళ డప్పు వాయిద్యాలతో కళాకారులు భక్తులను అలరించారు. భక్తులకు చక్కెర పొంగళి, దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదవితరణ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.1,20,711 విరాళాలు వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. ఈనెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులచే ఉచితంగా సామూహిక సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. సమిశ్రగూడెంలో పుంతలోముసలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. గోపవరం గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద మహిళలు కుంకుమపూజలు చేశారు. లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయసహిత రాజరాజేశ్వరిస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

లలితా.. లోకమాతా..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దసరా మహోత్సవాలలో భాగంగా దేవీచౌక్‌లోని అమ్మవారు బుధవారం బాలా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. అలాగే దేవీచౌక్‌లోని నాలుగు కూడళ్లలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగ్ చూడటానికి పెద్దలు, పిల్లలు ఆసక్తి చూపుతున్నారు.

క్లుప్తంగా

రూ.16 లక్షల పురుగు మందుల సీజ్

రాజమహేంద్రవరం రూరల్: రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అధికారి కె.కుమార్ ఆధ్వర్యాన అధికారులు బుధవారం దాడులు చేసి, భారీగా పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. మోరంపూడి వెంకటగిరి ప్రాంతంలోని ఎంఎస్ అడస్య ఆరోగ్య లిమిటెడ్ పురుగు మందుల గోడౌన్‌పై ఈ దాడులు నిర్వహించారు. అక్కడ పైమెట్రోజైన్ 50 గ్రాన్యూల్ ప్రొడక్ట్ కేసులపై ట్రేడ్ పేరు అలోస్కార్ ఉండగా, దీనిలోని 500, 1,000 గ్రాముల సీసాలపై ట్రేడ్ పేరు ఆస్కార్ అని ఉన్నట్టు గుర్తించారు. డీలర్ అలోస్కార్‌కు సంబంధించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్ మాత్రమే కలిగి ఉండటంతో సుమారు రూ.15,98,400 విలువైన 192 కేజీల ఆస్కార్ పురుగు మందులను మండల వ్యవసాయాధికారి సీజ్ చేశారు. గోడౌన్ ఇన్‌చార్జిపై చార్జిషీట్ దాఖలు చేస్తారన్నారు. అలాగే గోడౌన్‌లోని 50 మిల్లీలీటర్ల స్టిక్కింగ్ బాటిళ్లపై తయారీదారు పేరు, గరిష్ఠ అమ్మకపు ధర లేనందున ఒక కేసు, సురశ్రీ స్టిమ్యులెంట్ 4 కేజీల పురుగు మందు నిర్ణీత బరువు కన్నా తక్కువ ఉండటంతో మరో కేసు నమోదు చేశారు. తనిఖీలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి భార్గవ మహేష్ పాల్గొన్నారు.

రైలులో గర్భిణికి నొప్పులు



ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: రైల్లో ప్రయాణిస్తున్న గర్భిణికి అకస్మాత్తుగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడే ఆమెకు ప్రసవం చేశారు. వివరాలివీ.. బుధవారం తిరుపూరు నుంచి జార్ఖండ్ వెళ్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్‌లో సీత అనే గర్భిణికి రాజమహేంద్రవరం వచ్చేసరికి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే టికెట్ కలెక్టర్ రైల్వే అధికారులకు విషయం తెలిపారు. వారిచ్చిన సమాచారంతో 108 సిబ్బంది హుటాహుటిన రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడే ఆ గర్భిణికి డెలివరీ చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఎమర్జెన్సీ టెక్నీషియన్ హనీష తెలిపారు. సకాలంలో స్పందించి, వైద్య సేవలు అందించిన 108 సిబ్బంది హనీష, పైలట్ గణేష్‌ను రైల్వే సిబ్బంది అభినందించారు.

శ్రీనివాసుడికి లక్ష్మీ కటాక్షం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

- వాడపల్లి వేంకటేశ్వరస్వామికి దండిగా ఆదాయం
- 27 రోజులకు రూ.80.46 లక్షల రాబడి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా దండిగా ఆదాయం సమకూరింది. ఆలయంలోని హుండీలను బుధవారం తెరచి, లెక్కించగా 27 రోజులకు రూ.80,46,827 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ.60,63,558, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.19,83,269 సమకూరిందని వివరించారు. బంగారం 12 గ్రాములు, వెండి 309 గ్రాములు వచ్చాయని తెలిపారు. అలాగే ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 27 రోజులకు లెక్కించగా రూ.2,17,269 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈఓతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, దేవదాయ శాఖ కోనసీమ జిల్లా సహాయ కమిషనర్ కేఎస్‌వీడీ వరప్రసాద్, పొడగట్లపల్లి ఆలయ ఈఓ ఎం.రాధాకృష్ణ, ముమ్మిడివరం గ్రూపు దేవాలయం ఈఓ పీకే లక్ష్మణరావుల పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కించారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సువర్ణావకాశం ఓపెన్



సార్వత్రిక విద్యాలయం ద్వారా చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

- సార్వత్రిక విద్యలో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- సాధారణ కోర్సులతో సమానంగా వీటికి గుర్తింపు
- అన్ని ఉద్యోగాలకూ అర్హత

రాయవరం: ఉన్నత విద్య చదవాలనే ఆశ ఉన్నా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వాళ్లు అనేక మంది ఉన్నారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడే వారూ ఉన్నారు. అటువంటి వారు పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా టెన్త్, ఇంటర్ చదివే వీలు కల్పిస్తోంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు పూర్తి చేయలేకపోయిన వారు, ఉత్తీర్ణత పొందిన వాటిలో నుంచి గరిష్ఠంగా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకుని, మూడు సబ్జెక్టులతో మాత్రమే పరీక్షలు రాసే విధంగా ఓపెన్ స్కూల్ కోర్సును రూపొందించారు. జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్యలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. సార్వత్రిక విద్యకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అక్రిడిటేటెడ్ ఇనిస్టిట్యూషన్లు (ఏఐ) 160 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా వేలాది మందికి చదువుకునే అవకాశం లభిస్తోంది. ప్రవేశాలు పొందగోరే వారు అధ్యయన కేంద్రంలోని ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తును ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు అందించే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీని ద్వారా ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు అర్హత ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఆ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకూ అర్హులే.

ఫీజు వివరాలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ జూలైలో ప్రారంభమైంది. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెలాఖరు వరకూ ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్+అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,150 చెల్లించాలి. ఇంటర్మీడియెట్‌లో జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీ వారికి రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాలి.

30 కాంటాక్టు తరగతులు

- ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.
- పదో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే వారు గ్రూపు–ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బిలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.
- ఇంటర్ గ్రూపు–ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బి ప్రధాన సబ్జెక్టుల నుంచి మూడు కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.
- అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం పదో తరగతి పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టు రాసుకోవచ్చు.
- అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణత పొందకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

నియత పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలల్లో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులను ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్లలోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే రెగ్యులర్ టెన్త్, ఇంటర్‌లో పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండింటి మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. పదో తరగతిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు పదో తరగతికి అయితే సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు అయితే రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

జిల్లాల వారీగా ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులు

జిల్లా	టెన్త్	ఇంటర్	మొత్తం
కోనసీమ	855	3,358	4,213
కాకినాడ	1,061	3,556	4,617
తూర్పు గోదావరి	1,324	2,965	4,289
మొత్తం	3,240	9,879	13,119

ఇవీ అర్హతలు

- పదో తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- ఎలాంటి గరిష్ఠ వయోపరిమితీ లేదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు పదో తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది.

నెలాఖరు వరకూ గడువు



కొత్తగా అడ్మిషన్ పొందగోరే అభ్యర్థులు ఈ నెలాఖరు లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. మధ్యలో చదువు మానేసి తిరిగి కొనసాగించే వారికి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునేందుకు ప్రభుత్వం చక్కని అవకాశం కల్పిస్తోంది.
– పి.సాయి వెంకట రమణ, జిల్లా కో ఆర్డినేటర్, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం, అమలాపురం

ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి



ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రవేశాలు పొందిన అభ్యాసకులు తప్పనిసరిగా కాంటాక్టు క్లాసులకు హాజరు కావాలి. తగిన అర్హతలు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు.
– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం



ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ మార్గం ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు, చిరు ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి సార్వత్రిక విద్య ఎంతో ఉపయుక్తం. అధిక సంఖ్యలో అభ్యర్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలి.
– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ప్రాణాలు కాపాడిన కుక్క

- కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా అగ్నిప్రమాదం
- అరుపులతో లేపిన పెంపుడు శునకం
- సురక్షితంగా బయటపడిన కుటుంబం
- రూ.10 లక్షల ఆస్తినష్టం



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు (అంతరచిత్రం) ప్రాణాలు కాపాడిన ట్రిక్కీ

యానాం: విశ్వాసానికి ప్రతిరూపంగా కుక్క గురించి చెబుతారు. అది నిజమేనని నిరూపించింది ఆ శునకం. అర్ధరాత్రి ఆదమరచి నిద్రపోతున్న తన యజమాని కుటుంబాన్ని అగ్నిప్రమాదం నుంచి రక్షించింది. వివరాలివీ.. యానం కాకివారి వీధిలో కాకి నాగేశ్వరరావు అనే వ్యాపారి నివసిస్తున్నారు. ఆయన ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన పొరుగింటి వారు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను నిద్ర లేపేందుకు విఫలయత్నం చేశారు. అయితే నాగేశ్వరరావు పెంపుడు కుక్క ట్రిక్కీ.. ఆ అగ్నికీలలను చూసి అప్రమత్తమైంది. ఇంట్లో నిద్రపోతున్న వారి వద్దకు వెళ్లి, గట్టిగా అరవడం ప్రారంభించింది. దీంతో నాగేశ్వరరావు, ఆయన భార్య కనకదుర్గ, కుమారుడు సునీల్, ప్రజ్ఞ ఒక్కసారిగా మేల్కొన్నారు. ప్రమాదాన్ని గుర్తించి, ఇంటి నుంచి సురక్షితంగా బయట పడ్డారు. ట్రిక్కీ అరచినందు వల్లనే తమ ప్రాణాలు దక్కాయని, లేకుంటే అగ్నికి ఆహుతయ్యే వారమని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని లక్షలాది రూపాయల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. 15 కాసుల బంగారం, 500 గ్రాముల వెండి రూ.లక్ష నగదు, మంచాలు, ఫ్రిజ్, దుస్తులు, విలువైన భూమి డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు, రెండు మోటార్ సైకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. యానాం ఫైర్ ఇన్‌చార్జి మీరాసాహెబ్ ఆధ్వర్యాన ఫైర్‌మెన్ శ్రీనివాస్, కృష్ణారావు, వీరభద్రరావు, ప్రసాదరావు, రాజశేఖర్ ప్రమాద స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఇల్లు కాలి బూడిదైపోయింది. పుదుచ్చేరిలో ఉన్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అక్కడి నుంచే బాధితులతో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఐఈఆర్‌పీ పోస్టుల భర్తీకి రేపటి నుంచి టెస్టులు

కాకినాడ సిటీ: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని భవిత కేంద్రాల్లో 42 ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) పోస్టులు భర్తీ చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వీటిని పూర్తి కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఏపీ సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టులో 1:3 నిష్పత్తిలో 57 మంది (ఎంఆర్) అభ్యర్థులకు శుక్రవారం, 1:3 నిష్పత్తిలో 57 (హెచ్ఐ/వీఐ) అభ్యర్థులకు శనివారం జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యాన స్కిల్, పర్సనాలిటీ టెస్టులు జరుగుతాయన్నారు. వీటిని కాకినాడలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టెస్టులకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, ముఖ్యంగా స్పెషల్ బీఈడీ/డీఎడ్ సర్టిఫికెట్ రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు 100 పాయింట్లు సాధించాలన్నారు. సంబంధిత అభ్యర్థుల సెల్ నంబర్లకు వివరాలతో మెసేజ్ వస్తుందని నాగమణి తెలిపారు.





• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది.

అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వ బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు




సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు.



సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికి వాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్సులుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...
గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బుట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షాలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్సులు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.


• మీరా మోహన్, సబిత

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షాలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



• రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది. ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

• కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను


రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.





కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్ప కూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.




వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.